సాక్షి చిత్తూరు

బుధవారం । 17 । జూలై । 2024



ప్రహరీ గోడ కూల్చివేత వివాదాస్పదం

శాంతిపురం మండలంలో వైఎస్సార్‌సీపీనేత ఇంటి ప్రహరీ గోడను అధికారులు కూల్చివేయడం వివాదాస్పదమైంది. - 8లో



వైద్యం వికటిస్తే కఠిన చర్యలు

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం వికటించినట్టు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. - 8లో



లైంగికదాడి యత్నం కేసులో జైలు

మైనర్ బాలికపై లైంగికదాడికి యత్నం కేసులో వృద్ధుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ చిత్తూరులోని పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. - 8లో

న్యూస్‌రీల్

పక్కాగా కుష్ఠు సర్వే

● డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి ఆదేశం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కుష్ఠువ్యాధి గుర్తింపు సర్వేను పక్కాగా చేయాలని అధికారులకు డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్ఠు వ్యాధి బాధితులను గుర్తించేందుకు ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేయాలన్నారు. స్పర్శలేని మచ్చలున్న వారిని గుర్తించాలన్నారు. అలాంటి అనుమానితులకు కుష్ఠు నిర్ధారణ పరీక్షలు చేయించాలని, వ్యాధి ఉన్నట్లు తేలితే బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేను నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, అధికారులు సతీష్, అనిల్, సాయి షర్మిల, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

కుప్పం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని, నియోజకవర్గ స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజల భాగస్వామ్యంతో అటవీ పనులు

● సీఎఫ్‌ఓ నాగేశ్వరరావు



ననియాల ఏకో టూరిజం పనులను పరిశీలిస్తున్న అధికారులు

కుప్పం రూరల్: ప్రజల భాగస్వామ్యంతో అటవీ పరిధిలో పనులు చేయాలని అనంతపురం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నాగేశ్వరరావు, డీఎఫ్‌ఓ చైతన్యకుమార్ రెడ్డి కోరారు. మంగళవారం రామకుప్పం మండలం ననియాలలో ఏకో టూరిజం పనులను వారు పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే కుప్పం అటవీ ప్రాంతంలో చేస్తున్న పనుల్లో ప్రజలకు భాగస్వామ్యం కల్పించాలని, ఉపాధి నిధులతో పనులను పారదర్శకంగా చేయాలని ఆదేశించారు.

నిధుల స్వాహా ఉదంతంలో నలుగురిపై కేసు

పుంగనూరు : పుంగనూరు మండల పరిషత్ కార్యాలయంలో రూ.1.36 కోట్ల స్వాహా ఉదంతంలో బాధ్యులైన నలుగురిపై మంగళవారం రాత్రి కేసులు నమోదు చేశారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.1.36 కోట్లను కంప్యూటర్ ఆపరేటర్ సునీల్ కుమార్ తన వ్యక్తిగత ఖాతాలకు జమ చేసుకుని స్వాహా చేయడం విదితమే. దీనిపై ప్రస్తుత ఎంపీడీఓ వెంగముని రెడ్డి విచారణ చేసి జెడ్పీ సీఈఓకు నివేదిక పంపారు. దీని ఆధారంగా అప్పటి ఎంపీడీఓ నారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వరి, క్లర్క్ రాజశేఖర్ రెడ్డికి జెడ్పీ సీఈఓ షోకాజ్ నోటీసులు జారీచేశారు. సీఈఓ ఆదేశాల మేరకు ఎంపీడీఓ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్రైమ్ నెంబర్ 320/2024గా వివిధ నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితులుగా సునీల్ కుమార్, రాజశేఖర్ రెడ్డి, రాజేశ్వరి, నారాయణలను చూపారు. కాగా పోలీసులు ఈ కేసులో దర్యాప్తును వేగవంతం చేసినట్లు తెలిసింది.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 75,054 మంది స్వామివారిని దర్శించుకోగా 26,239 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.72 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తుండగా, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



తిరుమలలో భక్తులకు మోక్ష కటాక్ష ప్రాప్తి దర్శనం ఇస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి

● ఆధ్యాత్మిక శోభితం!

కట్ ఫ్లవర్స్.. దేశీయ పుష్పాల సుగంధభరిత పరిమళాలతో తిరుమల పులకించింది. మంగళవారం ఆణివార ఆస్థానం సందర్భంగా శ్రీవేంకటేశ్వరుడు సతీసమేతంగా పుష్పపల్లకీలో ఊరేగుతూ కనువిందు చేశారు. ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారిని తనివితీరా దర్శించి భక్తులు పులకించిపోయారు. గోవింద నామస్మరణ చేస్తూ కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

– తిరుమల



మాడవీధుల్లో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి

వసతి వెతలు



చిత్తూరు గురుకుల పాఠశాల డార్మెటరీలో ఇదీ పరిస్థితి

సాక్షి ఫోకస్

పేద, మధ్యతరగతి, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు గురుకుల, సంక్షేమ వసతిగృహాలు ఏర్పాటు చేశారు. వాటిలో అరకొర వసతులు, పారిశుద్ధ్య సమస్యలు, నాణ్యత లోపించిన ఆహారంతో విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. శుభ్రమైన మరుగుదొడ్లు, శుద్ధమైన తాగునీరు, మెనూ ప్రకారం భోజనం అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు అటువైపు కన్నెత్తి చూడకపోగా.. అధికారులు సైతం తమకేమీ పట్టనట్టు గాలికొదిలేశారు. ఫలితంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గురుకుల, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాల విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు.

సమస్యల్లో గురుకుల, సంక్షేమ వసతి గృహాలు

- పేద విద్యార్థులకు అందని నాణ్యమైన సౌకర్యాలు
- నాసిరకం ఆహారంతోనే అనారోగ్య సమస్యలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- చేతులెత్తేసిన జిల్లా యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తోంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో సమస్యలు చక్కబడడంలేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రపరిచేందుకు సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు అలాగే వినియోగించుకుంటున్నారు. చాలా వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఆయా శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యల పరిష్కారానికి చొరవచూపడంలో విఫలమవుతున్నారు. ప్రభుత్వం మారడంతో బదిలీల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ పర్యవేక్షణను గాలికొదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అత్యుత్సాహం

చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని గురుకుల పాఠశాలలకు గత ప్రభుత్వం నాడు–నేడు పథకంలో ఆర్వో ప్లాంట్లను సరఫరా చేసింది. అయితే కుప్పం, పెద్దపంజాణి, సదుం, గుడుపల్లి, గంగాధరనెల్లూరు, తిరుపతి, చంద్రగిరి, పూతలపట్టు, నాయుడుపేట, శ్రీకాళహస్తిలోని గురుకుల పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను వినియోగించకుండా మరుగునపడేశారు. విద్యుత్ బిల్లులను తగ్గించామని చెప్పుకునేందుకు ఆర్వో ప్లాంట్లను వినియోగించకుండా ప్రిన్సిపాళ్లు వదిలేసినట్టు సమాచారం. వసతి గృహాల్లో అపరిశుభ్రంగా ఉన్న ట్యాంక్ నీరే తాగాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు.

కమీషన్ కోసం నాసిరకం కూరగాయలు

పలు వసతి గృహాల్లో వార్డెన్లు మీషన్లకు కక్కుర్తిపడి నాసిరకం కూరగాయలను కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం. మార్కెట్లో కిలో టమాటాలు రూ.60, ఉల్లిపాయలు రూ.50 ఉంటే వసతి గృహాల వార్డెన్లు నాసిరకంగా విక్రయించే రూ.100కు 5 కిలోల టమాటాలు, ఉల్లిపాయలను కొనుగోలు చేస్తున్నారు. చిత్తూరు, తిరుపతి, పలమనేరు, కుప్పం, నాయుడుపేట, శ్రీకాళహస్తి, పుత్తూరులోని వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో వీటినే అధికంగా వినియోగిస్తున్నారు. కుళ్లిన కూరగాయలతో వంటలు చేయడంతో విద్యార్థులు పలు రకాల అనారోగ్యానికి గురవుతున్నారు.

ఉమ్మడి జిల్లా సమాచారం

ఏపీ రెసిడెన్షియల్ గురుకులాలు	05	ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకులాలు	17
ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలు	20	ఏపీ బీసీ రెసిడెన్షియల్ గురుకులాలు	12

ఆరోగ్య సమస్యలతో గైర్హాజరవుతున్న విద్యార్థులు

వసతి గృహం	హాజరు	గైర్హాజరు
చిత్తూరు జిల్లాలో ఎస్సీ వసతి గృహాలు	1,916	1,200
తిరుపతి జిల్లాలో ఎస్సీ వసతిగృహాల్లో	2,691	2,300
ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లో (చిత్తూరు)	516	100
ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లో (తిరుపతి)	3,914	577
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ (చిత్తూరు)	2,768	729
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ (తిరుపతి)	4,302	2,070

పాచిన ఆహారమే దిక్కు

గురుకులాలు, వసతి గృహాల్లో పాచిన ఆహారాన్నే విద్యార్థులకు వండిస్తున్నారు. నిబంధనల ప్రకారం వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మెనూను కచ్చితంగా అమలుచేయాలి. అయితే మెనూ ఏ మాత్రం అమలు కావడం లేదు. విద్యార్థులు ఎక్కువ.. వంట మనుషులు తక్కువగా ఉండడంతో నిన్నటి ఆహారాన్ని వడ్డిస్తున్నారు. తిరుపతి జిల్లా పుత్తూరులోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 105 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ గతంలో ఇద్దరు వంట మనుషులుండగా..ప్రస్తుత కూట మి ప్రభుత్వం ఒకరిని తొలగించింది. దీంతో రోజూ వండలేక పాచిన ఆహారాన్నే వడ్డిస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు.

ఇవిగో ఆధారాలు



పూతలపట్టు వసతి గృహం ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త

- తిరుపతి జిల్లాలోని గిరిజన వసతి గృహాల్లో 398 మందికి 110, చిత్తూరు జిల్లాలో 238 మందికి 98 మంది మాత్రమే భోజనం తింటున్నారు. మిగిలిన వారు వివిధ రోగాలతో ఇంటి వద్దే ఉంటున్నారు.
- చిత్తూరు జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 3,116 మందికిగాను 1,200 మంది అనారోగ్యాలతో వసతి గృహాలకు రావడంలేదు. అలాగే తిరుపతి జిల్లాలో 4,991 మందికిగాను 2,300 మంది పలు సమస్యలతో ఇంటిబాట పట్టారు.
- చిత్తూరు జిల్లాలోని బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 2,231 మందికి గాను 1,045, తిరుపతి జిల్లాలోని వసతి గృహాల్లో 5,384 మందికి 2,456 మంది మాత్రం హాజరవుతున్నారు.

ఫినాయిల్‌కు సొమ్ము లేదంట

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు ఫినాయిల్‌కు కూడా నిధులు లేవని పలువురు వార్డెన్లు గగ్గోలు పెడుతున్నారు. బడ్జెట్ ఇవ్వకపోవడంతో లైట్లు పనిచేయకపోయినా, చీపుర్లు, చిన్న చిన్న స్విచ్‌లు లాంటివి రిపేరు కొచ్చినా అలాగే వదిలేయాల్సి వస్తోందని వాపోతున్నారు. శ్రీకాళహస్తి, కుప్పం, చిత్తూరు, తిరుపతి, పుత్తూరు, గూడూరులోని గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో దాదాపు 35 మంది ఒప్పంద ప్రాతిపదికలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను తొలగించినట్లు తెలిసింది. దీంతో అక్కడ పారిశుద్ధ్య నిర్వహణ కష్టతరంగా మారుతోంది.



తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో ఇదీ పరిస్థితి



రేణిగుంట బీసీ బాలుర వసతి గృహంలో అపరిశుభ్రంగా వంటగది

తెరుచుకోని వరదయ్యపాళెం బీసీ హాస్టల్



వరదయ్యపాళెం: ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు పూర్తికావస్తున్నా నేటికీ వరదయ్యపాళెంలోని బీసీ హాస్టల్ తెరుచుకోలేదు. ఇక్కడ పాత విద్యార్థులు 17 మంది ఉండగా మరో 22 మంది నూతనంగా చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ఇన్‌చార్జ్ హాస్టల్ వార్డెన్ రామయ్యను వివరణ కోరగా మరో వార్డెన్‌కు హాస్టల్ బాధ్యతలను అప్పజెప్పేందుకు ప్రభుత్వం వద్ద ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

పిల్లలను పంపాలంటే భయంగా ఉంది



పిల్లలను గురుకుల పాఠశాలకు పంపాలంటే భయంగా ఉంది. నాయుడుపేట గురుకుల పాఠశాలలో ఘటన చూసి భయపడిపోయాను. పేదరికంలో ఉండే నాలాంటి ఎంతో మంది గురుకుల పాఠశాలలపై నమ్మకంతో పిల్లలను చదివించుకుంటున్నాం. మాకు దూరంగా ఉండే పిల్లలకు నిన్నటి అన్నం పెట్టడం చాలా అన్యాయం. మరుగుదొడ్లను సరిగ్గా శుభ్రపరచడం లేదు. ఏమైనా ఫిర్యాదులు చేస్తే పిల్లలను ఇబ్బందులు పెడతారని చెబుతున్నారు.

– గురునాథం, శ్రీకాళహస్తి, విద్యార్థి తండ్రి, తిరుపతి జిల్లా

ఉన్నతాధికారులు పట్టించుకోవాలి



ఉన్నతాధికారులు పట్టించుకుని తనిఖీలు చేయాలి. నా మనవడుని పూతలపట్టు గురుకుల పాఠశాలలో చదివించుకుంటున్నాను. నేనొచ్చినప్పుడల్లా ఏదో ఒక సమస్య చెబుతూనే ఉంటాడు. నాకు చెబితే నేనేమి చెయ్యాలి. ఉన్నతాధికారులు పాఠశాలను పరిశీలన చేస్తే పిల్లలు వారి సమస్యలను చెప్పుకుంటారు. అలా చేయకపోవడం వల్ల సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలొస్తే చూసేవారే కరువయ్యారు.

– జమున, విద్యార్థి అవ్వ, గంగాధరనెల్లూరు మండలం, చిత్తూరు జిల్లా

రైతులకు విరివిగా రుణాలు

● బ్యాంకర్లకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని రైతులకు బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేయడానికి రైతులు, కౌలు రైతులకు అవసరమైన ఆర్థిక సాయం బ్యాంకర్లు చేయాలన్నారు. బ్యాంకుల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. జిల్లాలో ఐదు లక్షల మంది రైతులు ఉన్నారని, సాగుకు అవసరమైన విత్తనాలు, మందులు, ఎరువుల కొనుగోలు నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడకుండా బ్యాంకర్లు చొరవ చూపాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని, పశువుల కొనుగోలు నిమిత్తం పాడి రైతులకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. బ్యాంకర్ల భాగస్వామ్యం తో జిల్లాలో స్థిరమైన వృద్ధి సాధనకు కృషి చేద్దామన్నారు. బ్యాంకర్ల సమావేశానికి ప్రతి బ్యాంకు తరఫున తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ జిల్లాలో 28 పబ్లిక్, ప్రైవేట్, ఆర్‌ఆర్‌బీ, కో–ఆపరేటివ్ బ్యాంకులు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి 274 శాఖలున్నాయని, క్రెడిట్ డిపాజిట్ రేషియో 138 శాతం ఉందన్నారు. ప్రాధాన్యతా రంగానికి సంబంధించి అడ్వాన్సుల కింద 2024 మార్చి 31నాటికి మొత్తం 67.17 శాతం ఇచ్చామన్నారు. ఇందులో వ్యవసాయ రంగానికి 53.51 శాతం ఉన్నట్టు చెప్పారు. 2023–24 వార్షిక రుణ ప్రణాళికలో లక్ష్యానికి మించి 106.62 శాతం రుణాలను ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాబార్డ్ డీడీఎం సునీల్, ఆర్‌బీఐ ఎల్‌బిఓ నాగప్రదీప్, ఇండియన్ బ్యాంక్ జెడ్‌ఎం బాలచంద్రమోహన్, డీఆర్డీఏ, మెప్మా పీడీలు తులసి, రాధమ్మ, జిల్లా వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీకృష్ణ , డాక్టర్ ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు, వివిధ బ్యాంకర్లు పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తాం

● త్వరలో నష్టపరిహారం ప్రకటిస్తాం : ఆర్డీఓ

● బైపాస్ అలైన్‌మెంట్ మార్చాలని కోరిన రైతులు



తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మనోజ్‌రెడ్డి

బైరెడ్డిపల్లె: పలమనేరు–క్రిష్ణగిరి నాలుగు రోడ్ల జాతీయ రహదారి పనులకు భూములు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ మనోజ్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, ఇది వరకే భూ సేకరణ చేశామని, నాలుగు లేన్ల రహదారి కోసం భూములు, ఇంటి స్థలాలు కోల్పోతున్న వారికి నష్టపరిహారం త్వరలోనే ప్రకటిస్తామన్నారు. రైతులు పలువురు మాట్లాడుతూ, రహదారి పనులు పూర్తయితే తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితులు తలెత్తుతాయని, ఈ సమస్య లేకుండా బైపాస్ అలైన్‌మెంట్ మార్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌కో తుక్కు తరలింపు


పనులను పరిశీలిస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో జిల్లా స్టోర్స్‌లోని తుక్కు వస్తువులను గతంలో వేలం వేయగా కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. వీటిని ఎస్‌ఏఓ శ్రీనివాసులు, టెక్నికల్ ఈఈ శ్రీనివాసులురెడ్డి, డీఈ జయప్రకాష్‌ల సమక్షంలో మంగళవారం తరలించారు. 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 178, 100 కేవీ 68, 63 కేవీ 43, 160 కేవీ 2 తుక్కు కింద వేలం వేశారు. మొత్తం 291 ట్రాన్స్‌ఫార్మర్లను అప్పట్లో వేలం వేస్తే.. హైదరబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. స్టోర్ నుంచి క్రేన్ సాయంతో లారీలోకి వీటిని తరలించారు. ఏఈలు వివేకానందరెడ్డి, బాలగుణయ్య పాల్గొన్నారు.

వినతులు పరిష్కరించండి

• జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : సీఎం పర్యటనలో అందిన వినతులను జాప్యం చేయకుండా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో జేసీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. కుప్పం సీఎం పర్యటనలో అందిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించే విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీలను నిశితంగా పరిశీలించి ప్రతి అర్జీకి లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: మహిళా వర్సిటీలో ఎడ్యుకేషన్ పాలసీ -2020 అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు బుధవారం నుంచి రెండు రోజుల పాటు జరగనుంది. ఈ సదస్సును వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం, ఢిల్లీకి చెందిన ఇండియన్ అడల్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్, ఎస్వీయూ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఈ సదస్సుకు జాతీయ స్థాయి ప్రొఫెసర్లు, వర్సిటీల అధికారులు పాల్గొననున్నారు.

ఇంటిగ్రేటెడ్ టమాట మార్కెట్

- క్యాటిల్‌ఫామ్ వద్ద 33 ఎకరాల్లో టమాట మార్కెట్ ఏర్పాటు యత్నం
- కొత్త డీపీఆర్, అంచనాలను సిద్ధం చేస్తున్న మార్కెటింగ్ అధికారులు
- గత ప్రభుత్వ పాలనలోనే భూమి చదును పనులు
- మరికొన్ని నెలల్లో పనులు మొదలు
- నిర్మాణం పూర్తయితే ఇతర రాష్ట్రాల వ్యాపారులు ఎక్కువ వచ్చే అవకాశం


పలమనేరు: పలమనేరు పట్టణ సమీపంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని క్యాటిల్‌ఫామ్ వద్ద ఇంటిగ్రేటెడ్ టమాట మార్కెట్ నిర్మిస్తే ఎంతో పలువురికీ ప్రయోజనకారిగా ఉంటుందని ఈ ప్రాంత రైతాంగం ఆశాభావంతో ఉంటోంది. ఈ పనులకు సంబంధించి స్థానిక మార్కెటింగ్ శాఖ కొత్త డీపీఆర్‌తో అంచనాలను పెంచి మళ్లీ ప్రభుత్వానికి సమర్పించనుంది. మోడల్ మార్కెట్ నిర్మాణం ప్రారంభమైతే స్థానిక ఏఎంసీ టమాట మార్కెట్‌లో సరుకు నింపుకునేందుకు వచ్చే వాహనాలకు ట్రాఫిక్ సమస్య ఉండదు. 33 ఎకరాల్లో నిర్మించాలనే ప్రతిపాదన ఉన్న మార్కెట్‌కు మూడు రాష్ట్రాల వ్యాపారులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

మార్కెట్ నిర్మాణానికి తీరిన సమస్యలు

ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీకి చెందిన 33 ఎకరాల భూమిని మార్కెట్ నిర్మాణం కోసం మార్కెటింగ్‌శాఖ కొనుగోలు చేసింది. ఇందుకు సంబంధించి మొత్తం రూ.1.45 కోట్లు కాగా వీటిని మూడు ఇన్‌స్టాల్‌మెంట్లలో యూనివర్సిటీకి ప్రభుత్వం చెల్లించాలి. గత ప్రభుత్వం రూ.36లక్షలను చెల్లించింది. ఆపై రూ.72 లక్షలు మంజూరు చేయగా, ఇటీవలే స్థానిక మార్కెటింగ్ అధికారులకు చేరింది. దీనిని యూనివర్సిటీకి చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మరోవైపు గతంలో వేసిన అంచనాలను తప్పించి కొత్త డీపీఆర్, కొత్త అంచనాలతో ప్రభుత్వానికి కొన్ని రోజుల్లో స్థానిక మార్కెటింగ్ అధికారులు సమర్పించనున్నారు.

మార్కెట్ నిర్మాణం ఇలా...

హైవేకు ఆనుకుని వాణిజ్య సముదాయాలను నిర్మించనున్నారు. మార్కెట్‌లో టమాట మండీలన్నీ ఓ వైపు, ఇతర కూరగాయల మండీలు మరో వైపు గతంలో ఉండేలా డిజైన్ చేశారు. మార్కెట్‌లో వాహనాల లోడింగ్, రైతులు తీసుకొచ్చే కూరగాయల వాహనాల కోసం 100 అడుగుల రోడ్లను వేయనున్నారు. మార్కెట్ వచ్చిన కూరగాయలకు అక్కడిక్కడే ప్యాకింగ్, గ్రేడింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. రైతుల సౌకర్యార్థం క్యాంటీన్లు, రైతు విశ్రాంతి గదులు మొదలైన వాటినీ నిర్మిస్తారు. దీనికి సమీపంలోనే పశువులు, గొర్రెల వారపుసంతలుంటాయి. జిల్లాలోనే దీన్ని మోడల్ మార్కెట్‌గా చేయాలని మార్కెటింగ్ శాఖ భావిస్తోంది. ఇప్పటికే ఆ శాఖ ఉన్నతాధికారులు పలుమార్లు ఇక్కడికొచ్చి పరిశీలించారు. ఇప్పుడు కొత్త డీపీఆర్(డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్)లోనూ కొంత మార్పులు మినహా మిగిలినవన్నీ ఉంటాయి.


ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నమూనా స్కెచ్

మోడల్ మార్కెట్‌గా...

ఇక్కడ గత ప్రభుత్వ పాలనలోనే భూమి చదును పనులు కొంతవరకు చేశారు. జిల్లాలోనే మోడల్ మార్కెట్‌గా ఉండాలనే లక్ష్యంతో 33 ఎకరాల్లో సువిశాలంగా అన్ని హంగులతో మార్కెట్ భవనాలకు అంచనా వేసి, నిర్మాణ డిజైన్ సైతం సిద్ధం చేశారు అయితే కూటమి ప్రభుత్వంలో డీపీఆర్ మారితే కొత్త స్కెచ్‌తో అంచనాలు పెరుగుతాయి. ఈ ప్రాంతం అటు బెంగళూరు, ఇటు చెన్నై మహా నగరాలు దగ్గరగా ఉండడం, వాటిని కలిపే జాతీయ రహదారి పక్కనే ఉండడం కలిసొచ్చే అంశం.

రోడ్డు కనెక్టివిటీతో మార్కెట్ విస్తృతి

ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా టమాట చెన్నైతో పాటు తమిళనాడులోని పలు జిల్లాలకు ఎక్కువగా ఎగుమతి అవుతోంది. ఇక్కడికి తమిళ వ్యాపారులు వస్తేనే ధరల బాగా పలుకుతాయి. ప్రస్తుతం వీరు ఎక్కువగా కర్ణాటకలోని వడ్డిపల్లె మార్కెట్‌కు వెళుతున్నారు. ఇక్కడ మార్కెట్ నిర్మాణం పూర్తయితే పెద్దసంఖ్యలో బయటి వ్యాపారులు రావడం ఖాయం. మార్కెట్‌కు ఆనుకుని చెన్నై–బెంగళూరు, క్రిష్ణగిరి–అనంతపూర్ జాతీయ రహదారులున్నాయి. మార్కెట్ నిర్మించనున్న ప్రాంతం నుంచి 4 కిలోమీటర్ల దూరంలో చైన్నై–బెంగళూరు సిక్స్‌ట్రాక్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో రోడ్ కనెక్టివిటీ పెరిగి సరుకు రవాణాకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుంది. దీంతో రైతుకు మార్కెటింగ్ సౌలభ్యం పెరిగి మంచి ధర లభించే అవకాశాలున్నాయి. ఈ విషయమై స్థానిక మార్కెట్ సెక్రటరీ సంజీవ్‌కుమార్‌ను వివరణ కోరగా.. కొత్త డీపీఆర్‌తో పెంచిన అంచనాలతో ప్రభుత్వానికి పంపుతున్నామని తెలిపారు. మరో మూడు నెలల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంటుందన్నారు.

మూడు తరగతుల్లో ఎనిమిది మందే..!

– విద్యార్థుల సంఖ్య పెంచాలన్న గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి


విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న సూర్యనారాయణ

పుత్తూరు: పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, ఇందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి సూర్యనారాయణ ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. మంగళవారం ఆయన పాఠశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం 3, 4 తరగతుల్లో ఇద్దరు చొప్పున, 5వ తరగతిలో నలుగురు మాత్రమే ఉండగా, 6 నుంచి 10వ తరగతి వరకు 97మంది విద్యార్థులు ఉన్నట్టు తెలుసుకున్నారు. గిరిజన కాలనీల్లోని తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, నమోదు శాతం పెంచాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం, భోజన వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శేషగిరి, వార్డెన్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైద్యం వికటిస్తే కఠిన చర్యలు

• పీహెచ్‌సీ తనిఖీలో హెచ్చరించిన కలెక్టర్


రాయలపేట పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

గంగవరం: ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం వికటించినట్టు తమ దృష్టికి వస్తే వైద్యాధికారులు, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యంపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. మంగళవారం గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, వార్డు, ల్యాబ్, మందుల గదిని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు ట్రీట్‌మెంట్ ఎలా చేస్తున్నారో తెలుసుకునేందుకే తనిఖీ చేసినట్టు చెప్పారు. రోగులకు మెరుగైన చికిత్సతో ఆరోగ్యవంతులుగా చేయడమే లక్ష్యంగా పీహెచ్‌సీలు పనిచేయాలని, తూతూమంత్రంగా చికిత్స చేస్తే చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో గర్భిణులకు సుఖప్రసవం తప్పనిసరిగా చేయాలన్నారు. ప్రసవం నిమిత్తం పీహెచ్‌సీలకు వచ్చిన గర్భవతులను పెద్దాసుపత్రికి వెళ్లాలని, తీరా అక్కడికి వెళ్లిన తరువాత ఇక్కడ కూడా కుదరదు.. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలని ముప్పుతిప్పలు పెట్టి మహిళల ప్రాణం మీదకు వచ్చినట్టు తెలిస్తే శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆసుపత్రులకు కాన్పుల నిమిత్తం వచ్చేవారిని డబ్బు కోసం ఉద్దేశపూర్వకంగా ప్రైవేటు ఆసుపత్రులకు పంపుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. ప్రసవం తరువాత బాలింతకు మంచి పోషకాహారం ఇవ్వడం, పసికందుకు ఇమ్యునేషన్, వ్యాక్సినేషన్ వేయడం బాధ్యత అన్నారు. తల్లికి రెండేళ్ల వరకూ తప్పనిసరిగా మంచి పోషకాహారం ఇవ్వాలని అంగన్‌వాడీలను ఆదేశించారు. ఇది సక్రమంగా అందుతుందా, లేదా అనేది ఆసుపత్రి సిబ్బంది తనిఖీ చేయాలన్నారు. ఇప్పటి వరకూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 109 కాన్పులు చేసినట్లు తెలిపారు. ఇంకనూ కొన్ని ఆసుపత్రులు అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నట్టు చెప్పారు. ఆసుపత్రులకు సకాలంలో మందులు సరఫరా కానిపక్షంలో వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

పెద్దపంజాణి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మండలంలోని రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా టైఫాయిడ్, డెంగీ జ్వరాలు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందివ్వాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాల్లో పర్యటించి జ్వరపీడితుల వివరాలు సేకరించి వారికి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచులతో సమన్వయమై మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్, పారిశుద్ధ్య చర్యలు వేగవంతం చేయాలని వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నందిని, పీఎస్ గణపతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రివర్షన్ ఉత్తర్వులు ఇవ్వలేరా? : ఎస్టీయూ


ఏడీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగోన్నతులు ఎలాగూ ఇవ్వరు...కనీసం రివర్షన్ ఉత్తర్వులను కూడా ఇవ్వలేరా? అని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్ నిలదీశారు. మంగళవారం ఆ అసోసియేషన్ నాయకులు డీఈఓ కార్యాలయంలో ఏఓ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందుల వల్ల తమకు ఉద్యోగోన్నతి వద్దని పలువురు టీచర్లు దరఖాస్తు చేసుకున్నారని, సంవత్సర కాలంగా డీఈఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారన్నారు. అయితే అసంబద్ధమైన కారణాలు చూపుతూ అధికారులు జాప్యం చేస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించి ఉత్తర్వులు జారీ చేయాలని లేని పక్షంలో ఈ నెల 29 న ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ గోడ కూల్చివేత వివాదాస్పదం

శాంతిపురం: మండల సచివాలయం సమీపంలోని పెద్దబొమ్మనపల్లె వద్ద రెవెన్యూ అధికారులు చేపట్టిన ఆక్రమణల తొలగింపు వివాదాస్పదంగా మారింది. వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యంకు చెందిన ప్రహరీగోడ ప్రభుత్వ భూమిలో ఉందని అధికారులు మంగళవారం కూల్చివేశారు. అయితే సర్వే నంబర్ 56/1లోని 20 సెంట్ల భూమిని తాను 2012లో రూ.16 లక్షలు పెట్టి కొనుగోలు చేశానని బాధితుడు తెలిపారు. రెండు వారాల్లోపు ఆక్రమణలు తొలగించాలని తనకు సోమవారం నోటీసులు ఇచ్చిన రెవెన్యూ అధికారులు 24 గంటలు గడవక ముందే కూల్చివేశారని ఆయన వాపోయాడు. అధికారుల తీరును వైఎస్సార్ సీపీ నాయకుడు, రెస్కో మాజీ వైస్ చైర్మన్ కోదండరెడ్డి ఓ ప్రకటనలో ఖండించారు. గడువుకు ముందే కూల్చివేయడం సమంజసం కాదని నిరసించారు. గత ఎన్నికల్లో సుబ్రమణ్యం వైఎస్సార్ సీపీకి పనిచేశాడనే కక్షతో ప్రహరీ గోడను నేలమట్టం చేయడం దారుణమని చెప్పారు.

బాలికపై లైంగికదాడి యత్నం కేసులో జైలు, జరిమానా

చిత్తూరు అర్బన్/పుత్తూరు: మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నం కేసులో గంజి శ్రీరాములు (71) అనే నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ చిత్తూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి మంగళవారం తీర్పునిచ్చారు. ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ కథనం మేరకు.. పుత్తూరు మండలం గొల్లపల్లెకు చెందిన శ్రీరాములు మగ్గంనేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2020 ఏప్రిల్ 20న తన ఇంటి వద్ద ఆడుకుంటున్న ఓ ఎనిమిదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లాడు. బాలికపై లైంగికదాడికి ప్రయత్నించగా, ఆమె అరుస్తూ అతడి బారి నుంచి తప్పించుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై అప్పట్లో సీఐ ఎం.వెంకట్రామిరెడ్డి పోక్సో (పిల్లలపై లైంగిక దాడుల నివారణ చట్టం) కింద కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. కేసు తుది విచారణకు రాగా నేరం రుజువైంది. దీంతో శ్రీరాములుకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బాలిక కుటుంబానికి రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. నేరం రుజువు చేయడంలో కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ టి.పట్టాభి, సబ్ డివిజన్ కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి హెచ్‌సీ జి.రామకృష్ణమరాజును డీఎస్పీ వై.శ్రీనివాసరావు అభినందించారు.

బీఎల్వోలకు భత్యం చెల్లించరూ!


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ ఎన్జీవోలు

• ఆర్డీఓకు వినతి

పలమనేరు: నియోజకవర్గంలో ఓటర్ల జాబితాను తయారు చేయడంలో కీలక బాధ్యతలను నిర్వర్తించిన బీఎల్‌వోలకు మూడునెలలు కావొస్తున్నా ఇప్పటివరకు భత్యం చెల్లించలేదని ఏపీ ఎన్జీవో అధ్యక్షులు ఆనంద్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై స్థానిక ఆర్డీఓ మనోజ్ రెడ్డికి మంగళవారం వినతిప్రతం అందజేశారు. పలువురు బీఎల్వోలుగా పనిచేసిన సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి చుక్కెదురు

- పర్సన్ ఇన్‌చార్జ్ నియామకాన్ని రద్దు చేసిన హైకోర్టు
- సహకార సంఘ చట్టం మేరకు సభ్యులకే అధికారం
- సూపర్‌బజార్ అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్


సుభాష్ చంద్రబోస్

పలమనేరు: పలమనేరు సూపర్‌బజార్‌కు ప్రస్తుత అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్‌పై రాజకీయ కక్షతో అధికార పార్టీ ఇటీవల ఏర్పాటు చేసిన పర్సన్ ఇన్‌చార్జ్ నియామకం చెల్లదని హైకోర్టు ఆదేశాలను జారీ చేసింది. దీనిపై స్థానిక సూపర్‌బజార్‌లో అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్ మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇటీవల తమ సూపర్‌బజార్‌లో అక్రమాలు జరిగాయనే ఫిర్యాదు మేరకు స్థానిక ఆర్డీఓ మనోజ్ రెడ్డి రికార్డులను పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉన్నాయని నివేదిక ఇచ్చారన్నారు. కానీ అధికారంలోని టీడీపీ తనపై కక్ష సాధించేందుకు పర్సన్ ఇన్‌చార్జ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దీనిపై తాము హైకోర్టును ఆశ్రయించామన్నారు. సహకార సంఘాలకు సంబంధించి సభ్యుల వాటాలతో నడిచే సంస్థలపై పెత్తనం వారికే ఉంటుందని దీనిపై ఎలాంటి ఉత్తర్వులు చెల్లవని విస్పష్టంగా తీర్పునిచ్చిందన్నారు. ఈ మేరకు త్వరలో సూపర్‌బజార్‌కు ఎన్నికలను నిర్వహించే అధికారం చట్టం మేరకు కార్యవర్గానికి ఉంటుందని ఆయన తెలిపారు.

గంజాయి స్వాధీనం..

ఆరుగురు యువకులు అరెస్ట్

• డీఎస్పీ విష్ణు రఘువీర్


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ, సీఐ

పుంగనూరు: రూ.6లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకుని ఆరుగురు యువకులను అరెస్ట్ చేసినట్టు పలమనేరు డీఎస్పీ విష్ణు రఘువీర్ మంగళవారం రాత్రి తెలిపారు. సీఐ జయరామయ్యతో కలసి ఆయన విలేకరులకు తెలిపిన వివరాలు.. అందిన రహస్య సమాచారం మేరకు భగత్‌సింగ్‌కాలనీలోని ఓ ఇంటిపై పోలీసులు దాడులు చేశారు. విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 50 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన గంజాయి విక్రేతలు సిద్ధాంత్‌కన్‌హార్, గజేంద్రన్‌గిరి, విజయవాడకు చెందిన శివనాగేశ్వరరావు, పలమనేరుకు చెందిన నవీన్, పుంగనూరుకు చెందిన ఆవుల రవి, నవీద్ అహమ్మద్‌లను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.6 లక్షలని డీఎస్పీ తెలిపారు. పట్టణంలో మత్తు పదార్థాలు, గంజాయిను విక్రయిస్తే ఉపేక్షించేది లేదని, ఎక్కడైనా వీటిని విక్రయిస్తున్నట్టు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సుబ్బారెడ్డి, ఏఎస్‌ఐ జయచంద్ర, హెడ్‌కానిస్టేబుల్ ఢిల్లీకుమార్, పోలీసులు రెడ్డెప్ప, యల్లప్ప, చిన్నరెడ్డెప్ప, ప్రకాష్, రమణ, తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ పోలీసులను అభినందించారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

• రూ.25 వేలు అందజేసిన కలెక్టర్


టింపుల్‌కు చెక్కును అందజేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులలో పేద విద్యార్థిని రూ.25 ఆర్థిక సాయం చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో నగరంలోని సంతపేట బండ్లవీధికి చెందిన ఆరవ తరగతి విద్యార్థిని టింపుల్‌కు ఈ సాయం అందజేసినట్లు కలెక్టర్ చెప్పారు. టింపుల్ తల్లిదండ్రులు ఇద్దరూ మరణించారని ఆర్థిక సాయం చేయాలని 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో టింపుల్ పెద్దమ్మ జయలక్ష్మి వినతి పత్రం ఇచ్చారన్నారు. దీనిని పరిశీలించిన తర్వాత ఆర్థిక సాయం చేశామన్నారు. కార్యక్రమంలో సీపీఓ సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

సురక్షితంగా మొహర్రం జరుపుకోండి

• ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ముస్లింలు పవిత్రంగా భావించే మొహర్రం పండుగను సురక్షితంగా జరుపుకోవాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు ఆకాంక్షించారు. శాంతి, ప్రజాస్వామ్యం, మానవ హక్కుల కోసం 14 శతాబ్దాల క్రితం జరిగిన చారిత్రాత్మక పోరాటంలో అశువులు బాసిన అమరులను స్మరిస్తూ నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు భక్తి ప్రపత్తులతో ఈ పండుగను జరుపుకోవాలని కోరారు.

అయ్యా! నా కొడుకు నన్ను పట్టించుకోవడం లేదు

• ఓ తండ్రి నివేదన'

పలమనేరు: కన్నబిడ్డే తన బాగోగులు పట్టించుకోకుండా ఇంటినుంచి గెంటేశాడని ఓ తండ్రి మీడియాను ఆశ్రయించాడు. వివరాలు..మున్సిపాలిటీలోని ఎంఎస్‌ఎస్ కాలనీకి చెందిన మహబూబ్‌బాషా (64) అలియాస్ దుగ్గు బాషా లారీ క్లీనర్‌గా పనిచేస్తూ కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఇంటికే పరిమితమయ్యాడు. అయితే కుమారుడు నయాజ్ అతడి సంరక్షణను విస్మరించి ఇంటి నుంచి గెంటేయడంతో తనకు న్యాయం చేయాలని మీడియాను ఆశ్రయించాడు. అయితే ఈ విషయంలో ఆ కాలనీకి చెందిన కొందరు పెద్దలు జోక్యం చేసుకున్నారు. వృద్ధుని కుమారుడితో మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు.

కర్ణాటక మద్యం ధ్వంసం


అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

గుడుపల్లె: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో మంగళవారం కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, గుడుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులు జేసీబీలతో ధ్వంసం చేశారు. మండలం సమీపంలోని దళవాయికొత్తపల్లె చెరువు వద్ద ఉన్న డంపింగ్ యార్డు వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 10,582 టెట్రా మద్యం ప్యాకెట్లు (సుమారు 1,554 లీటర్లు) ధ్వంసం చేసినట్టు చెప్పారు. దీని విలువ 4,79,442 రూపాయలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు చక్రపాణి, రామక్రిష్ణ, వేణు, జిలానీ పాల్గొన్నారు.